సాక్షి మంచిర్యాల
ఆదివారం । 28 । జూలై । 2024



గడ్డి మందుకు అడ్డేది? 10లో▸
ఈ ఖరీఫ్ సీజన్‌లో నిషేధిత విత్తనాలు, రసాయన మందులను అధికారులు పూర్తిగా అడ్డుకోలేదు. దీంతో కలుపు నివారణకు రైతులు నిషేధిత గ్లైఫోసెట్ వాడుతున్నారు.



జిల్లా సంక్షేమ అధికారి బదిలీ
మంచిర్యాలటౌన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనను కలెక్టర్ కుమార్‌దీపక్ సత్కరించారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం 29.4 /25.5
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

బెటాలియన్ కమాండెంట్‌గా వెంకటరాములు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటరాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా పి.వెంకటరాములు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి 15వ బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరాములు గుడిపేట బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ పోలీస్ అధికారులు, మెడికల్ అధికారులు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా పదోన్నతిపై 3వ బెటాలియన్ కమాండెంట్‌కు బదిలీ అయ్యారు. శుక్రవారం వరకు సిరిసిల్ల 17వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు ఇన్‌చార్జి కమాండెంట్‌గా ఉన్నారు.

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలటౌన్: జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఏవోగా యూ.జ్యోత్స్నను, హాజీపూర్ తహసీల్దార్ పి.సతీశ్‌కుమార్ స్థానంలో డి.శ్రీనివాసరావును నియమించారు. మంచిర్యాల తహసీల్దార్‌గా రఫతుల్లా హుస్సేన్‌ను నియమించగా, ఇక్కడ పనిచేస్తున్న కె.రమేశ్‌ను మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. లక్సెట్టిపేట తహసీల్దార్‌గా ఏ.దిలీప్‌కుమార్‌ను నియమించగా, అక్కడ పనిచేస్తున్న టి.రాఘవేంద్రరావును కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఆర్.అరవింద్ కుమార్‌ను నియమించగా, హాజీపూర్ తహసీల్దార్ పి.సతీశ్‌కుమార్‌ను కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

ఎన్‌సీఆర్సీ జిల్లా చైర్మన్‌గా రాజేశ్



రాజేశ్ కుమార్

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన కుందారపు రాజేశ్‌కుమార్ జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్(ఎన్‌సీఆర్సీ) జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. నాణ్యత లేని కల్తీ వస్తువులను విక్రయించే వారిని నిలదీయడంతోపాటు, ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని జాతీయ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాహిత్యాన్ని వ్యాప్తి చేయాలి



మాట్లాడుతున్న రఘు

లక్సెట్టిపేట: సాహిత్యాన్ని అంతటా వ్యాప్తి చేయాలని సాహిత్య అకాడమీ తెలుగు భాషా సలహాదారు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రఘు అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సాహిత్య అకాడమీ సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సాహిత్యం నేర్చుకోవాలని సూచించారు. పాటలు పాడటం ఇతర అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. సాహిత్యం గ్రామీణ ప్రాంతాలలో వ్యాప్తి చెందుతుందని తెలిపారు. అనంతరం సాహిత్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, సాహిత్యకారులు రవీందర్, శైలజ, వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సింగరేణికి వాన గండం!



శ్రీరాంపూర్ ఓసీపీలో నిలిచిపోయిన కంపెనీ డంపర్లు

- ఓసీపీల్లో స్తంభించిన మైనింగ్ ఆపరేషన్స్
- జిల్లాలో రోజుకు 33 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం
- రూ.11 కోట్ల ఆర్థిక నష్టం

శ్రీరాంపూర్: జిల్లాలో ఎడతెరిపి లేని ముసురు సింగరేణి పెద్ద గండంగా మారింది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. ముసురు రూపంలో వాన పడుతుండటంతో ఓసీపీ క్వారీల్లో రోడ్లు ఆరడం లేదు. దీంతో మైనింగ్ ఆపరేషన్స్ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బొగ్గుపెళ్ల బయటికి రావడం లేదు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఓబీ పనులు ఎక్కడికక్కడే ఆగి పోయాయి. ఓబీకి, బొగ్గు ఉత్పత్తికి వినియోగించే వాహనాలన్నీ క్వారీల నుంచిపైకి తరలించారు. బెల్లంపల్లి డివిజన్‌లోని కైరిగూడ, మందమర్రి డివిజన్ పరిధిలోని కళ్యాణిఖని ఓసీపీ, ఆర్కేపీ ఓసీపీ, శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో వర్షాల కారణంగా రోజుకు 33 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతోంది. దీని విలువ సుమారు రూ.11 కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఓసీపీల్లో రోజుకు 3.75 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికి తీయాల్సి ఉండగా దీనికి కూడా బ్రేక్ పడింది. వర్షం పరిస్థితిని కంపెనీ డైరెక్టర్లు ఎప్పటికప్పుడు ఏరియా జీఎంలతో మాట్లాడుతూ సమీక్షిస్తున్నారు.

ముసురుతోనే ఇబ్బంది...
వర్షాకాలంలో కొన్ని గంటలపాటు కుండపోతగా వానపడ్డా, ఓమోస్తారుగా వానపడి తరువాత పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఆరు గంటలపాటు పొడి వాతావరణం ఏర్పడితే వాహనాలు నడిపించి బొగ్గు ఉత్పత్తి చేస్తారు. ఐతే ఇటీవల కురుస్తున్న ముసురు వాన తెరిపివ్వకపోవడంతో ఓసీపీ రోడ్లు తడి ఆరడం లేదు. దీంతో వాహనాలు దించడం ఇబ్బందిగా మారింది. వర్షం పూర్తిగా తగ్గితేనే బొగ్గు ఉత్పత్తి ప్రారంభం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

శ్రీరాంపూర్‌లో..

ఎస్సార్పీ ఓపెన్‌కాస్టు గనిలో సాధారణ రోజుల్లో రోజుకు లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి, 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని చేస్తున్నారు. వర్షంతో ఇది పూర్తిగా నిలిచిపోయింది. ఇందారం ఓసీపీల్లో రోజుకు 70 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. ఇక్కడ కూడా పూర్తిగా పనులు ఆగిపోయాయి. ఈనెల 16 నుంచి పూర్తిగా పనులు నిలిచిపోయాయి. ఈ రెండు ఓసీపీల్లో సర్ఫేస్‌లో ఉన్న స్టాక్ కోల్‌ను విద్యుత్ కేంద్రాలకు తరలిస్తున్నారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ కేంద్రానికి ఇక్కడి నుంచే బొగ్గు రవాణా అవుతుంది. వర్షాకాలం దృష్ట్యా అధికారులు ముందుగానే నెల రోజులకు సరిపడా బొగ్గును ఎస్టీపీపీలో నిల్వ చేశారు. ఇప్పుడు కూడా స్టాక్ కోల్ నుంచి రోజుకు 4 వేల టన్నుల బొగ్గును ఎస్టీపీపీకి తరలిస్తున్నట్లు ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు.

మందమర్రిలో..

మందమర్రి ఏరియాలో రెండు ఓసీపీలు ఉన్నాయి. ఇందులో ఆర్కేపీ ఓసీపీలో రోజువారీగా 25 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, 2,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. గడిచిన వారం రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక్కడ స్టాక్ కోల్ కూడా లేదని అధికారులు తెలిపారు. కళ్యాణఖని ఓసీపీల్లో నుంచి రోజుకు 60 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ, 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా వారం రోజులుగా జరగడం లేదు. స్టాక్ కోల్ కూడా అడుగంటింది. ఈ నెలలో ఇప్పటి వరకు 18 రోజులు ఉత్పత్తి నష్టం జరిగిందని ఓసీపీ అధికారులు తెలిపారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి ఏరియాలో ఉన్న ఏకైక పెద్ద ఓసీపీ కైరిగూడ. వర్షంతో ఇక్కడ కూడా బొగ్గు ఉత్పత్తి జరగడం లేదు. ఈ ఓసీపీల్లో రోజుకు 1.2 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ, 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. వర్షంతో ఉత్పత్తి నిలిచిపోయింది. స్టాక్ కోల్‌ను రవాణా చేస్తున్నారు.

వర్షపు నీటి పంపింగ్..

వర్షానికి అన్ని ఓసీపీ క్వారీల్లోకి భారీగా వరద చేరుతోంది. ఈ నీటిని అధికారులు ఎప్పటికప్పుడు ఉపరితలానికి పంపింగ్ చేస్తున్నారు. భారీ సామర్థ్యం గల నీటిని తోడే మోటార్లతో నీటిని క్వారీలో నిలువకుండా చర్యలు తీసుకుంటున్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నీటిపై తేలాడే ఫ్లోటింగ్ పంపులు ఏర్పాటు చేశారు. ఇక ఓసీపీల్లో షావల్స్‌ను వరద రాని ప్రాంతాల్లో, ఎత్తయిన ప్రదేశాల్లో నిలిపి ఉంచారు. డంపర్లను ఓబీ క్యాంపులకు తరలించారు. కంపెనీ డంపర్లు, ఇతర వాహనాలను సర్ఫేస్‌లోని యార్డులో నిలిపి ఉంచారు. వాహనాలకు అవసరమైన మెయింటనెన్సు పనులు అధికారులు చేయిస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్ చేస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆకస్మిక మరణాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రపంచ సీపీఆర్ ది నోత్సవం పురస్కరించుకొని సీపీఆర్ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు హాజరయ్యాయి. జిల్లా వైద్య ఆరో గ్యశాఖ అధికారి అనితతో కలిసి కలెక్టర్ స్వయంగా సీపీఆర్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏటా ఎంతో మంది గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్నారన్నారు. వాటిని నివారించేందుకు, పునర్జన్మ ప్రసాదించేందుకు సీపీఆర్ గురించి తెలుసుకోవాల ని సూచించారు. సీపీఆర్ పిల్లలకు, పెద్దలకు భిన్నంగా ఉంటుందని తెలిపారు. సీపీఆర్ చేసే సమయంలో పక్కటెముకల మీద ఒత్తడి చేయవద్దని తెలిపా రు. రొమ్మును ఎముకపై మాత్రమే బరువు ఉంచాల ని, పొత్తి కడుపును కుదించవద్దని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహన శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలు, కళాశాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు సీపీఆర్‌పై అవగాహన కల్పించేలా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌నాయక్, ప్రోగ్రాం అధికారి కృపామయి, జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమాధికారి చిన్నయ్య, బాలల పరిరక్షణ అధికారి ఆనంద్, ఐసీడీఎస్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ, పిల్లలకు తాగునీరు, పోషకాహారం అందించే విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. పిల్లల హాజరు 100 శాతం ఉండేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తమ పరిధిలోని కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సఖీ హెల్ప్‌లైన్ కేంద్రం గోడ ప్రతులను ఆవిష్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో మంచి విద్యను అందించే దిశగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టిందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో డీఈవో యాదయ్య, ఎంఈవోలు, పంచాయతీరాజ్, ఐటీడీఏ ఏఈలు, డీఈలతో అభివృద్ధి పనుల పురోగతిపై శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తిచేసి ఎంబీ రికార్డులు సమర్పిస్తే నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి బిల్లులు చెల్లిస్తామన్నారు. పనులు నాణ్యతతో చేసేలా హెచ్‌ఎంలు, ఎంఈవోలు, ఏఈలు పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల పెయింటింగ్ పనుల ప్రతిపాదనలు తయారుచేసి డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

మరమ్మతులకు సిద్ధంగా ఉండాలి

- ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుకు అవసరమైన సామగ్రితో సిబ్బంది సిద్ధంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి, ఎస్‌ఈ ఎన్.శ్రావణ్‌కుమార్ సూచించారు. పాత మంచిర్యాలలోని విద్యుత్ పరికరాల స్టోర్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన డీటీ పనులు, కొత్త సర్వీసుల మంజూరుకు కావాల్సిన మెటీరియల్ సమృద్ధిగా ఉండన్నారు. ఒరిగిన స్తంభాలు, డబుల్ జంపరింగ్ మెటీరియల్, రాడ్, స్టేవైర్, క్రాస్ ఆర్మ్, లూజ్‌లైన్లు సరిచేయడానికి, కాలం చెల్లిన చెడిపోయిన ఏబీ స్విచ్‌లు తదితర మరమ్మతులకు సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో 24 గంటల సర్వీసులు అందించేలా అత్యవసర సమయంలో పరికరాలు సరఫరా చేసేలా స్టోర్‌లోసిద్ధంగా ఉంచాలన్నారు. ఎస్‌ఈవెంట టెక్నికల్ ఏడీఈ తిరుపతి, స్టోర్ ఇన్‌చార్జి డీఈ, ఏఈ మంచాల శ్రీనివాస్ ఉన్నారు.



స్టోర్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్‌ఈ) శ్రావణ్‌కుమార్

సెలవు రోజుల్లో బిల్లు చెల్లించవచ్చు..
విద్యుత్ వినియోగదారులు నెలవారీ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు సెలవురోజుల్లో కూడా కౌంటర్లు పనిచేస్తాయని ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన విద్యుత్ బిల్లు చెల్లింపు కౌంటర్లు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా పనిచేస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు.

డయల్ 100, 112 కాల్స్‌కు తక్షణం స్పందించాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఆపదలో ఉన్నవారు డయల్ 100, 112 నంబర్లకు చేసే ఫోన్ కాల్స్‌కు పోలీసులు తక్షణమే స్పందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాసులు సూచించారు. కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంచిర్యాల, పెద్దపెల్లి జిల్లాల పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్స్, పెట్రోకార్, పెట్రోలింగ్ విధులు నిర్వహించే వారితో శనివారం జూమ్ మిటింగ్ నిర్వహించారు. డయల్ 100, 112 ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 100, 112 ఫోన్ కాల్స్‌తో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని ఆరా తీశారు. ఆపదలో ఉన్నప్పుడు వచ్చే ఫోన్‌కాల్స్‌కు తక్షణం స్పందించడం ద్వారా ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. కాల్ వచ్చిన నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది 24/7 గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల మధ్య ఉంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్, విసిబుల్ పోలీసింగ్, ప్రొయాక్టివ్ పోలీసింగ్ ఉండాలని అన్నారు. విద్యాసంస్థల వద్ద, బస్టాండ్, రైల్వే స్టేషన్, పబ్లిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో డయల్ 100, 112 నబర్లపై అగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రజల రక్షణ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, పెద్దపెల్లి డీసీపీ చేతన, ఏసీపీలు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

జిల్లాలో 19.7 మి.మీల వర్షం

- జలాశయాల్లోకి భారీగా వరద

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కరిసింది. శనివారం ఉదయం వరకు జిల్లాలో 19.7 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరుతోంది. నీల్వాయి, గొల్లవాగు, ర్యాలీవాగు జలశయాల్లోకి వరద వస్తోంది. నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకుతోంది. గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలాల వారీగా చూస్తే... జన్నారంలో 14 మిల్లిమీటర్లు, లక్సెట్టిపేటలో 10.9, హాజీపూర్‌లో 9.9, కాసిపేటలో 24.6, తాండూర్‌లో 17.1, భీమినిలో 15.7, కన్నెపల్లిలో 17.5, వేమనపల్లిలో 19.8, నెన్నెలలో 19.9, బెల్లంపల్లిలో 17.2, మందమర్రిలో 16.8, మంచిర్యాలలో 29.5, నస్పూర్‌లో 29.7, జైపూర్‌లో 25.6, భీమారంలో 20.8, చెన్నూర్‌లో 34.1, కోటపల్లిలో 34.1 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

సైబర్ వల.. సామాన్యుడి విలవిల!

ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ ఓ సంస్థ ఇటీవల ప్రచారం చేసింది. పెట్టుబడి పెడితే రెట్టింపు ఇస్తామని నమ్మించింది. ఈ ప్రచారం నమ్మి చాలా మంది పెట్టుబడి పెట్టారు. మొదట కొందరికి డబ్బులు రావడంతో మంచిర్యాల, ఆసిఫాబాద్, గోదావరిఖని ప్రాంతాలకు చెందిన చాలా మంది పెట్టుబడి పెట్టారు. సంస్థ బోర్డు తిప్పేయడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మంచిర్యాల పట్టణంలో విద్యుత్ బిల్లు చెల్లించేందుకు ఆన్‌లైన్‌లో ఓ వినియోగదారుడికి ఓ లింక్ వచ్చింది. దానిని క్లిక్ చేశాడు. తర్వాత ఓ వ్యక్తి అతనికి ఫోన్ చేశాడు. మాయ మాటలు చెప్పి ఓటీపీ అడిగాడు. ఓటీపీ చెప్పడంతో అతని ఖాతా నుంచి రూ.5.20 లక్షలు కాజేశాడు.

- ఆన్‌లైన్ యాప్‌లతో మోసాలు
- రోజుకో తీరుగా నేరాలు
- డబ్బుల ఆశతో అనలుకే ఎసరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో రోజుకోచోట వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు విసిరే వలలో చిక్కి అనేక మంది విలవిలలాడుతున్నారు. లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. మోసాలు పెరుగుతున్న అప్రమత్తంగా లేకపోవడం సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది.

మోసాలు అనేకం...
స్మార్ట్ ఫోన్ అర చేతిలోకి వచ్చాక మోసం ఏ రూపంలో వస్తుందో చాలా మంది పసిగట్టలేకపోతున్నారు. గుర్తింపు లేని ఆన్‌లైన్ ట్రేడింగ్‌లు, అపరిచిత వ్యక్తులు పంపే వెబ్‌సైట్ లింకులు, మెసేజ్‌లు క్లిక్ చేసి మోసపోతున్నారు. తెలియని లింకుల కారణంగానే జిల్లాలో చాలా మంది మోసపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుంచి అధికారికంగా ఎలాంటి సందేశాలు రాకున్నా నిజమైన మెసేజ్‌లుగా భావిస్తూ వాటిని క్లిక్ చేస్తున్నారు. ఆ తర్వాత ఓటీపీలు కూడా చెప్పి తమ ఖాతాను సైబర్ నేరగాళ్లకు అప్పగిస్తున్నారు. వీటికితోడు ఆన్‌లైన్ బిజినెస్ అంటూ పలు రకాలుగా చేస్తున్న ఆఫర్లను నమ్మి నష్టపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తున్నప్పుడు వచ్చే ప్రకటనలు చూసి నిజమే అని నమ్మి ఆ సందేశాలను అనుసరిస్తున్నారు. కొందరు మోసమని తెలిసి కూడా ఇలాంటివాటిలో ఇరుక్కుంటున్నారు.



ఇటీవల ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేసిన యాప్

చెక్ చేసుకోవాలి...
ఆన్‌లైన్‌లో పెట్టుబడులు, ట్రేడింగ్, గేమ్స్, లోన్స్, ఆఫర్లు, గిఫ్టులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, విద్యుత్ ఇతరత్రా బిల్లులు అంటూ వచ్చే లింకులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అపరిచిత వెబ్‌సైట్లు, ఖాతాలు వంటి వాటికి దూరంగా ఉంటేనే మేలని పోలీసులు సూచిస్తున్నారు. ఏదైనా అన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలంటే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, సంస్థ నుంచి ధ్రువీకరణ ఉంటేనే లావాదేవీలు జరపాలంటున్నారు. ఇక ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేప్పుడు అన్నీ సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

ఈ ఏడాదిలో జరిగిన సైబర్ నేరాలు
నమోదైన కేసులు : 81
కోల్పోయిన మొత్తం : రూ.1.47 కోట్లు
నిలుపుదల చేసిన మొత్తం : రూ.33.07 లక్షలు

అప్రమత్తంగా ఉండాలి..



ఆన్‌లైన్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. లావాదేవీల్లో ఒకటి రెండుసార్లు వివరాలు చూసుకోవాలి. కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. 'డిలీట్' అనే కార్యక్రమంతో మరింత అవగాహన కల్పిస్తాం. ఎవరికైనా తెలియక మోసపోతే సైబర్ క్రైం విభాగంలో ఫిర్యాదు చేయాలి.
– ఎం శ్రీనివాసులు, సీపీ, రామగుండం.

వానొస్తే సెలవే..

భీమారం: మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ పరిధి రెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలభవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మినీ అంగన్‌వాడీ భవనం కూడా ఉరుస్తోంది. దీంతో పాఠశాలకు అప్రకటిత సెలవు ప్రకటిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో శనివారం పాఠశాలకు పిల్లలు రాలేదు. పిల్లల కోసం ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచర్ చాలాసేపు ఎదురు చూశారు. రెడ్డిపల్లి పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. దీంతో రెండేళ్లుగా పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 11 మంది విద్యార్థులే ఉన్నారు.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం



ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ టీచర్

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

చెన్నూర్: పట్టణంలోని రజకవాడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో శనివారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 4100 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెల వద్ద కాపరులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కుమ్మరికుంట మినీ ట్యాంక్‌బండ్‌పై అమర్చిన విద్యుత్ స్తంభానికి తగిలి రెండు గొర్రెలు మృతి చెందినట్లు గొర్ల కాపరి మధు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ట్యాంక్‌బండ్‌పై రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వేసేందుకు స్తంభం కింది భాగంలో ఏబీ స్విచ్‌లు అమర్చారన్నారు. స్విచ్‌లు కిందకు వేలాడుతుండడంతో విద్యుత్‌షాక్ తగిలి గొర్రెలు మృతి చెందాయని శనివారం వాపోయారు. రెండు గొర్రెలు మృతి చెందడంతో రూ. 20 వేలు నష్టం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గొర్రెలు మృతి చెందాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

విషాహారం తిని పెంపుడు జంతువులు మృతి

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉడుత పోషక్కకు చెందిన పెంపుడు జంతువులు విషాహారం తిని శనివారం మృతి చెందాయి. ఎస్సై రాములు తెలిపిన కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బండం సురేందర్ రెడ్డి పోషక్కపై గల కక్షతో ఆమె నివాసం సమీపంలో విషం కలిపిన బియ్యం వేశాడు. బియ్యాన్ని తిన్న ఒక గొర్రె, 5 కోడిపిల్లలు, కుక్క అక్కడికక్కడే మృతి చెందాయి. పోషక్క ఫిర్యాదు మేరకు సురేందర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులు మృతి



రాజు (ఫైల్)



వినయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం గద్దెరాగడికి చెందిన గుర్రం రాజేశం –రాజేశ్వరి దంపతుల కుమారుడు రాజు(30) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తల్లి రాజేశ్వరికి మెడిసిన్ కొనుగోలు చేసేందుకు ఏసీసీ సమీపంలో రోడ్డు దాటుతుండగా మందమర్రి వైపు నుంచి వస్తున్న సీసీసీ నస్పూర్‌కు చెందిన దొమ్మటి మల్లయ్య –కళావతి దంపతుల కుమారుడు వినయ్‌కుమార్(27) తన ద్విచక్రవాహనంపై అతి వేగంగా ఢీకొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వినయ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగు దాటితేనే వైద్యం



వాగు దాటి గోపాల్‌పూర్ గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారులు



కాలినడకన జెండాగూడకు వెళ్తున్న వైద్య సిబ్బంది

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అనేక గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాగులు ఉండడంతో రాకపోకలు సాగించే వారు ప్రమాదకరంగా వాగులు దాటుతున్నారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించగా వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది వాగులు దాటారు. కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిధి హీరాపూర్ గ్రామపంచాయతీలోని గోపాల్‌పూర్ గ్రామానికి వైద్యులు ప్రతాప్‌నాయక్, పూజిత, సిబ్బంది శనివారం వాగులు, వంకలు దాటి ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యసేవలు అందించారు. ఇచ్చోడ మండలం నర్సాపూర్ పీహెచ్‌సీ సిబ్బంది అడవిబాటలో కాలినడకన నాలుగు కిలోమీటర్లు వెళ్లి వైద్య సేవలు అందించారు. జెండాగూడ, ధర్మాజీపేట్, కొలంగూడ, బుర్సిగుట్ట గ్రామాలకు హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఆశ కార్యకర్త సరోజలు నడుచుకుంటూ వెళ్లి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. – ఇంద్రవెల్లి/ఇచ్చోడ

ఒర్రె దాటితేనే పాఠం

ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించాలంటే వాగులు, ఒర్రెలు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. దహెగాం మండలంలోని కోత్మీర్ నుంచి జెండాగూడ, దుబ్బగూడ గ్రామాలకు వెళ్లాలంటే జెండాగూడ సమీపంలో ఉన్న ఒర్రెను సహసం చేసి దాటాల్సి వస్తుంది. ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాళ్లు ఎంతో కష్టంగా ఒర్రె దాటి వెళ్లి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – దహెగాం



ఒర్రె దాటుతున్న దుబ్బగూడ ఉపాధ్యాయురాలు



ఒర్రె దాటుతున్న జెండాగూడ టీచర్

గడ్డి మందుకు అడ్డేది?

- గ్లైసిల్ విత్తనం మాదిరే.. గ్లైఫోసెట్ సరఫరా
- దెబ్బతింటున్న భూసారం
- ప్రభుత్వ నిషేధం ఉన్నా పట్టింపేది?



స్వాధీనం చేసుకున్న గ్లైఫోసెట్ గడ్డిమందు (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత, గుర్తింపు లేని విత్తనాలను అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. నిషేధిత విత్తన సరఫరాని పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోయారు. ఇప్పుడు కలుపుమందు సరఫరా నియంత్రించకపోవడంతో జిల్లాలో అక్రమవ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంది. విత్తనాలు, కలుపు నివారణ గడ్డి మందు దందా యథేచ్ఛగా సాగుతోంది. ఓ వైపు వర్షాలు కురుస్తుండడం, మరో వైపు చేలలో కలుపు మొక్కలు పెరిగిపోతున్నాయి. దీని నివారణకు రైతులు నిషేధిత గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. వ్యాపారులు గుర్తింపు లేని పత్తి విత్తనాలు చేరవేసిన మాదిరిగా గ్లైఫోసెట్‌ను అందజేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లాకు చేరవేస్తున్నారు. అటవీప్రాంతం, చేల వద్ద భూమిలో పాతి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తాండూర్, భీమిని, మహారాష్ట్ర సిరొంచ మీదుగా అర్జునగుట్ట, కోటపల్లి, చెన్నూర్ సరిహద్దు నుంచి వేలాది లీటర్లు తరలిస్తున్నారు. చోటమోట నాయకుల హస్తంతోనే పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రికి రాత్రే ప్రైవేటు వాహనాల ద్వారా జిల్లాకు చేరుకుంటున్నాయి. గ్లైఫోసెట్‌తో భూసారం కోల్పోవడం, పర్యావరణానికి ముప్పు ఉంది. రైతులు క్యాన్సర్, తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

గుట్టుచప్పుడు కాకుండా..

ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.48 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇందులో 30 శాతం వరకు నిషేధిత గ్లైసిల్ విత్తనాలే ఉన్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత గ్లైఫోసెట్ మందును రైతులకు అందిస్తున్నారు. లీటర్‌కు రూ.700 నుంచి 900 చొప్పున, 5 లీటర్లు, 10 లీటర్లు, 20 లీటర్ల క్యాన్లు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. లిక్విడ్ కాకుండా పౌడర్ రూపంగా తీసుకువస్తున్నారు.

దెబ్బతింటున్న భూసారం

పత్తి చేనులో కలుపు తీతకు రైతులు గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. దీంతో పర్యావరణానికి హానితోపాటు భూసారం దెబ్బతింటుంది. జిల్లాలో సాగయ్యే పత్తి పంట కలుపు నివారణ, కూలీల కొరతను అధిగమించడానికి గ్లైఫోసెట్ మందును పిచికారికి ఆసక్తి కనబరుస్తున్నారు. నిషేధిత గ్లైఫోసెట్ కొనుగోలుకు వేలకు వేలు ఖర్చుచేస్తున్నారు. అధికారులు దాడులు చేసి వందల క్వింటాళ్ల గ్లైసిల్ లూజు క్వింటాళ్ల కొద్దీ విత్తనాలు, ప్యాకెట్లను పట్టుకున్నారు. అప్పటికే చాలామటుకు విత్తనాలు రైతులకు చెంతకు చేరాయి.

ప్రాణానికి ముప్పు

నాలుగైదు ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాలో రైతులు నిషేధిత (బీజీ–3) పత్తి విత్తనాలు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు అమెరికాకు మోన్‌శాంటో అనే కంపెనీ విడుదల చేసింది. విత్తనంతోపాటు అదే కంపెనీ గ్లైఫోసెట్ పేరుతో గడ్డి మందును తయారు చేసింది. బీజీ–3 పత్తి విత్తనం సాగు చేసిన పంటలో ఈ మందు పిచికారి చేస్తే గడ్డి మాత్రమే చనిపోతుంది తప్పా పత్తి మొక్కలకు ఏమి కాదు. కాని ఈ గ్లైఫోసెట్ వినియోగించడం వల్ల భూసారం కోల్పోవడం, పర్యావరణానికి హాని, రైతులకు ప్రాణానికి ముప్పు కలుగుతుంది. ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి పెద్దమొత్తంలో వీటి అమ్మకాలు నిషేధించింది.

నిండుకుండలా 'ఎల్లంపల్లి'



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద గల ఎల్లంపల్లి(శ్రీపాద సాగర్) ప్రాజెక్ట్ నీటి మట్టం 17 టీఎంసీలకు పైగా నీటితో నిండుకుండలా మారింది. శనివారం వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవల్ కాగా 147 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు గాను 17.410 టీఎంసీల నీటి సామర్థ్యానికి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 13 వేల కూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 12,600ల క్యూసెక్కుల నీటిని జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పరీక్షకు మోడల్‌స్కూల్ విద్యార్థి



హర్షితను అభినందిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ విద్యార్థిని హర్షిత సకురా కార్యక్రమం రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికైనట్లు డీఈవో అశోక్ తెలిపారు. హర్షితను శనివారం పాఠశాల ఆవరణలో జిల్లాసైన్స్ అధికారి మధుకర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ జపాన్ ఉన్నత పాఠశాలల సకురా కార్యక్రమం కోసం నిర్వహించిన జిల్లాస్థాయి పరీక్షలో హర్షిత ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో ఎస్‌సీఈఆర్‌టీలో నిర్వహించే పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి ఐదుగురు విద్యార్థులకు జపాన్ ఉన్నత పాఠశాలల సైన్స్ కార్యక్రమం సకురాలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మైసమ్మ తల్లి బోనాల జాతర



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించనున్న ఆషాఢమాస బోనాల జాతరకు ఆలయం ముస్తాబైంది. మందమర్రి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మైసమ్మ తల్లిని తమ ఇలవేల్పుగా భావిస్తారు. ఏటా నిర్వహించే జాతరకు వేల సంఖ్యలో భక్తులు వస్తుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డిలు శనివారం ఏర్పాట్లు పరిశీలించారు. సుమారు 250 మంది సిబ్బందితో జాతరకు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు.

ఉద్యోగులు స్వీయ రక్షణ పాటించాలి



మాట్లాడుతున్న గోపాల్ రాజు

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి, విధి నిర్వహణలో స్వీయ రక్షణ పాటిస్తూ పనిచేయాలని కార్పొరేట్ డీజీఎం సేఫ్టీ గోపాల్ రాజు తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించారు. ఉద్యోగులతో మాట్లాడుతూ రక్షణ సూత్రాలు పాటిస్తూ పని చేయాలన్నారు. చాలా ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నాయని, వీటి నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే కంపెనీకి శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీ రావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు చంద్రమోహన్, మోత లచ్చన్న, అధికారుల సంఘం నాయకులు కమ్మృద్దీన్, రక్షణ అధికారి సంపత్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి

శ్రీరాంపూర్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచి పర్యావరణంపై అవగాహన కల్పించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. మంచిర్యాలలోని కార్మెల్ స్కూల్ విద్యార్థులు 5వేల విత్తన బంతులను తయారుచేసి జీఎంకు అందజేశారు. శనివారం జీఎం కార్యాలయం వద్ద గల సెంట్రల్ నర్సరీలో జరిగిన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎకోక్లబ్ యాక్టివిటీ పేరుతో విత్తన బంతులను తయారు చేయడం అభినందనీయమన్నారు. శ్రీరాంపూర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జింక పిల్లను రక్షించిన అధికారులు



కాలువలో కొట్టుకుపోతున్న జింకపిల్లను పట్టుకున్న సెక్షన్ అధికారి

జన్నారం: కడెం ప్రధాన కాలువ నుంచి పొలాలకు నీరందించే చిన్న కాలువలో చుక్కల జింకపిల్ల శనివారం ప్రమాదవశాత్తు పడింది. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో జింకపిల్లి కొట్టుకుపోతోంది. దీనిని గమనించిన రైతులు అటవీ అధికారులకు సమాచారం అందించగా వారు వెళ్లి కాపాడారు. తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం అటవీ డివిజన్ తపాలపూర్ సెక్షన్ పరిధిలో పొలాలకు వెళ్లే చిన్న కాలువలో చుక్కల జింకపిల్ల పడి కొట్టుకుపోతుంది. సమాచారం అందుకున్న సెక్షన్ అధికారి నహీద పర్వీన్, బీట్ అధికారి లక్ష్మీపతి, బేస్ క్యాంపు వాచర్లు కాలువలో దిగి కొట్టుకుపోతున్న జింక పిల్లను పట్టుకున్నారు. బయటకు తీసుకెళ్లి పరిశీలించారు. ఎలాంటి గాయాలు లేకపోవడంతో అడవిలో వదిలేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.

బొగ్గు పరిశ్రమ రక్షణ కోసం బస్సుయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాతమంచిర్యాల: సింగరేణి బొగ్గు బావుల పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి జిల్లాలో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బస్సుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గుగనులను వేలం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాక్‌ల వేలం నిలిపివేయాలనే డిమాండ్‌తో జిల్లాలో జూలై 29 నుంచి ఆగస్టు 5 వరకు బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రలో వామపక్ష పార్టీలు, ప్రజలు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు యువత, సామాజిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దుంపల రంజిత్, మహేశ్, మోహన్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్య

కోటపల్లి: మండలకేంద్రానికి చెందిన ఇప్ప నారాయణ(70) శనివారం ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుమారుడు సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటపల్లికి చెందిన ఇప్ప నారాయణ కొన్ని రోజులుగా అల్సర్, గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా చెన్నూర్‌లో కొడుకు ఇప్ప సంపత్ ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. మూడు రోజులు క్రితం ఆసుపత్రికి వెళ్లగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. శనివారం ఉదయం కడుపులో నొప్పి ఎక్కువ కావడంతో బయటకు వెళ్లివస్తానని చెప్పి నారాయణ కోటపల్లిలోని తన ఇంటికి వచ్చి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సౌదీ నుంచి స్వగ్రామం చేరుకున్న మృతదేహం

దండేపల్లి: ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లి 20 రోజుల క్రితం ఫిట్స్‌తో మృతిచెందిన మండలంలోని పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్(41) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. వెంకటేశ్ మరణవార్త విన్న నుంచి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతుడికి భార్య సరిత, కూతుళ్ల శ్రీవల్లి, అభిజ్ఞ ఉన్నారు. వెంకటేష్‌కు కొడుకులు లేకపోవడంతో పెద్దకూతురు శ్రీవల్లి అంతిమ సంస్కారాలు నిర్వహించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీకి చెందిన తక్కలపల్లి అంజన్న(22) మృతి చెందగా, నదీమాబాద్ కాలనీకి చెందిన గోగర్ల విజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. యువకులు కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు కారులో వస్తున్న క్రమంలో శీర్షా గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించగా అంజన్నను పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై మధుకర్ పరిశీలించి వివరాలు సేకరించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన లావుడ్య శాంతాబాయి (52) అనే మహిళ శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్ గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సింగల్‌గూడకు చెందిన శాంతాబాయి మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి సమీపంలో అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. శనివారం సింగల్‌గూడలోని తమ సొంత ఇంటి వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు కాలినడకన వెళ్లే క్రమంలో దారి మధ్యలో ఉన్న రైల్వే ట్రాకు దాటుతుండగా మంచిర్యాల వైపు నుంచి బల్లార్షా వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వర్షానికి కూలిన ఇళ్ల గోడలు

భీమారం: భారీ వర్షాల కారణంగా మండలంలోని మద్దికల్‌లో శనివారం మూడు ఇళ్లకు సంబంధించిన గోడలు కూలిపోయాయి. గ్రామానికి చెందిన బచ్చల కొమురక్క, చింతం బానక్క, దుర్గం రోశయ్యలకు చెందిన ఇంటి గోడలు వర్షానికి తడిసి నేలమట్టమయ్యాయి. పాత ఇళ్లు కావడంతోనే కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. కాగాతహసీల్దార్ సదానందం మాట్లాడుతూమండలంలో వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకితక్షణసహాయంగా రూ.4,200 అందిస్తున్నట్లు తెలిపారు.

గోదావరిలో మృతదేహం గుర్తింపు

మంచిర్యాలక్రైం: గోదావరి నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. నదిలో మృతదేహం కొట్టుకుపోతుంటే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగలోకి దిగి జాలర్ల సహాయంతో రైల్వేబ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని వెతికి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. కానీ మృతదేహం ముళ్ల కంచెలో చిక్కుకుపోవడంతో బయటకు రాలేదు. దీంతో అక్కడే వదిలేసినట్లు తెలుస్తోంది. ఇటీవల పాత మంచిర్యాలకు చెందిన ఓ మహిళ మిస్సింగ్ కేసు నమోదైంది. మృతదేహం సదరు మహిళదే నని పోలీసులు భావిస్తున్నారు.